www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 21 మే 2024

5

వైఎస్ఆర్



అభివృద్ధి పనులు పరిశీలన

ప్రజాశక్తి - కడప అర్బన్



పనులు సమీక్షిస్తున్న కమిషనర్

కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ పుట్లంపల్లి ఇండస్ట్రీయల్ ఎస్టేట్, ఉక్కాయపల్లి గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్, వినాయక నగర్ ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగ అధికారులతో కలిసి పరిశీలించారు. పుట్లంపల్లి ముందు భాగంలో వేసిన కంపోస్ట్ శుభ్రం చేసేలా చర్యలు చేపట్టాలని శానిటేషన్ విభాగ అధికారులకు సూచించారు. వారం రోజుల నుంచి రోజూ తడి, పొడి చెత్త వివరాలను పరిశీలి ంచారు. తడి, పొడి చెత్త సేకరణ రోజూ 6 టన్నులకు తగ్గకుండా సేకరించాలని అధికారులకు సూచనలను ఇచ్చారు.

మామిడి రైతుకు నిరాశే..



వాతావరణ మార్పుతో తగ్గిన దిగుబడి
మార్కెట్‌లో అరకొరగా అమ్మకాలు
కొండెక్కిన ధరలు

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లా వ్యాప్తంగా మామిడి తోటల సాగు ఎక్కువగా ఉంది. ఎంతో ఆశగా మామిడి పండు సాగు చేస్తున్న రైతన్నకు సరైన గిట్టుబాటు ధరలు లేక నాలుగేళ్లుగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మామిడి రైతులకు గతేడాది కంటే ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించక నష్టపోయారు. కొన్ని చోట్ల ఎండ వేడిమికి మామిడి కాయలు రాలి పోగా, మరికొన్ని చోట్ల మామిడి చెట్లకు రోగం వచ్చి కాయలు రాలిపోయాయి. ఇక్కడ నుండి ముంబై, చెన్నై, హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు మామిడికాయలను ఎగుమతి చేస్తారు. గతంలో మామిడి పూతను చూసి వ్యాపారస్తులు మామిడి పంటను కొనేవారు ప్రస్తుతం మామిడికాయలను చూసి వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారు గతంలో మాదిరిగా వ్యాపారస్తులు ఉత్సాహం చూపడం లేదు. అనుకున్నంత ఏడాది అనుకున్నంత మామిడిపంట రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

35,867 హెక్టార్లలో మామిడి సాగు

జిల్లా వ్యాప్తంగా 35,863 హెక్టార్లలో మామిడి పంటను రైతులు సాగు చేశారు. రైల్వేకోడూర్‌లో 3,687 హెక్టార్లు, టి.సుండుపల్లెలో 3,036, చిన్నమండెంలో 2,500, లక్కిరెడ్డిపల్లిలో 2,400, వీరబల్లిలో 2,105, కంభంవారిపల్లెలో 1,850, చిట్వేలిలో 1,760, గుర్రంకొండలో 1,658, రామాపురంలో 1,433, పీలేరులో 1,400, కలకడలో 1,378, పెనగలూరులో 1,352, సంబేపల్లిలో 1,230, వాల్మీకిపురంలో 1,150, కలికిరిలో 1,090, గాలివీడులో 9,020, రాయచోటిలో 890, నిమ్మనపల్లిలో 820, పెద్దమండ్యంలో 784, నందలూరులో 712, ఓబులవారిపల్లిలో 650, రామసముద్రంలో 600, మదనపల్లిలో 690, రాజంపేటలో 374, కురబలకోటలో 300, తంబళ్లపల్లెలో 300, బి.కొత్తకోటలో 286, మొలకలచెరువులో 250, పెద్దతిప్పసముద్రంలో 217, పుల్లంపేటలో 196 హెక్టార్లలో మామిడి పంటను రైతులు సాగు చేశారు.

మార్కెట్లో కానరాన్ని మామిడి పండ్లు..

మామిడి ధరలు ఎండలతో సమానంగా మండిపోతున్నాయి. మార్కెట్లో ఎక్కడ చూసినా కూడా మామిడి పండ్లు కనిపించడం లేదు. ఒకవేళ కనిపించినా చాలా తక్కువ మోతాదులో మామిడి కాయలు ఉంటున్నాయి. మార్చి చివరి వారం నుంచి మే వరకు మార్కెట్ మొత్తం మామిడి పండ్లు కనిపిస్తాయి. ఈసారి మామిడి దిగుబడి తగ్గడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని వ్యాపారులు చెబుతున్నారు. పూత రాకపోవడం వచ్చినా కూడా రాలిపోవడంతో మామిడి దిగుబడిపై ప్రభావం పడింది.గతం లో శీతాకాలంలో మామిడి చెట్లకు దట్టంగా పూత వచ్చిన ఆ తర్వాత వాతావరణంలో మార్పులు కారణంగా నిలబడక పోవడం, నాసిరకమైన మందులు ప్రభావంతో పూత నిలబడలేదని రైతులు వాపోతున్నారు. దీనికి కారణంగానే మార్కెట్లో ఎక్కడ మామిడి పండ్లు కనిపించడం లేదు. అరకురా కొన్ని మామిడి పండ్లు కనిపించిన ఆ పండ్లు కూడా కిలో రూ.80 నుంచి రూ.180 వరకు మార్కెట్‌లో అమ్ముతున్నారు.



మామిడి రైతులకు ఈ ఏడాది కన్నీళ్లే మిగులుతున్నాయి. కష్టనష్టాలకు ఓర్చుకుని ఏళ్ల తరబడి తోటలను సాగు చేస్తున్నా.. మామిడి పంట దిగుబడి రావడం లేదు. వాతావరణంలో మార్పులు మామిడిపై తీవ్రంగా ఉండడంతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొన్ని చోట్ల ఎండ వేడిమికి మామిడి కాయలు రాలిపోగా, మరికొన్ని చోట్ల మామిడి చెట్లకు రోగం వచ్చి కాయలు రాలి పోయాయి. వేసవి వచ్చిందంటే పండ్లలో రారాజుగా పిలవబడే మామిడిని రుచి చూడని వారు ఉండరు. అలాంటిది ప్రస్తుత మామిడి కాయలు కనిపించడం లేదు. అరకొర మామిడికాయలు మార్కెట్లో దర్శనమిస్తే వాటి ధరలు కొండెక్కి కూర్చున్నాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలు మామిడి కాయలను కొనాలంటే జంకుతున్నారు. మామిడి కిలో రూ.80 నుంచి రూ.180 వరకు మార్కెట్లో విక్రయిస్తున్నారు. ఈసారి మామిడి దిగుబడి బాగా తగ్గడంతోనే ధరలు పెరిగిపోయాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.



మండీలో విక్రయానికి సిద్ధంగా ఉన్న మామిడి కాయలు

వెలవెల పోతున్న మామిడి మండీలు

జిల్లాలో మామిడి కాయలను విక్రయించేందుకు పలు మండీలు ఉన్నాయి. రైతులు, వ్యాపారస్తులు మామిడి కాయలను ఈ మండీలకు చేరవేసి అమ్ముకుంటుంటారు. ప్రస్తుతం మామిడి దిగుబడి తగ్గడంతో మండీలకు మామిడికాయలు రాకపోవడంతో మామిడి మండీలు వెలవెల పోతున్నాయి. ప్రతి నియోజకవర్గంలో ఒక్క కొంతమంది వ్యాపారులు మామిడి షెడ్లను ఏర్పాటు చేశారు. ఆయా మండలాలలోని రైతులు ఆ మామిడి షెడ్లకు మామిడి కాయలను తరలించి విక్రయిస్తుంటారు. ప్రస్తుతం ఆ షెడ్లకు కూడా కాయలు రాకపోవడంతో అవి కూడా వెలవెల పోతున్నాయి.

వీరబల్లి బేనీషాకు భలే గిరాకీ

ప్రతి ఒక్కరికీ వీరబల్లి బేనీషా అంటే మహా ఇష్టం. ఈ బేనీషా చాలా రుచిగా ఉంటుంది. ఈ బేనీషాను కొనుగోలు చేయడానికి ఢిల్లీ, ముంబై, కలకత్తా ప్రాంతాల నుంచి వ్యాపారస్తులు వచ్చి కొనుగోలు చేసి తీసుకొని వెళుతుంటారు. ఈ వీరబల్లి బేనీషాను మన రాష్ట్రమే కాదు విదేశాలు కూడా ఎగుమతి చేస్తుంటారు. ఈ బేనీషాకు అంత పేరు వచ్చిందని చెప్పవచ్చును. వీరబల్లి మండలంలో మామిడి తోటలో అధికంగా ఉన్నాయి. అందుకోసమే మామిడి ప్రియులు ఈ వీరబల్లి బెనిషను ఇష్టపడతారు.

అధికంగా ఖర్చవుతోంది



మామిడి పంట సాగు చేయాలంటే అధిక ఖర్చు వస్తుం ది. మామిడి చెట్లకు దుక్కి, నీరు కట్టడం, ఎరువులకు అధికంగా ఖర్చ వుతోంది. కూలీలు కూడా ఎక్కువయ్యాయి. పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదు. ఇంత కష్టపడినప్పటికీ నాలుగేళ్లుగా మామిడి పంట సరిగ్గా రావడం లేదు. పెటు ్టబడి ఎక్కువ అవుతుంది. ఆదాయం తగ్గుతున్నది. ప్రభుత్వాలు ఆదుకోవాలి. రైతులకు న్యాయం చేయాలి.

- రెడ్డప్ప రైతు, మాధవరం, రాయచోటి మండలం.

ప్రభుత్వం ఆదుకోవాలి



జిల్లాలో మామిడి సాగు చేసిన ప్రతి రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి. రైతులకు కూలీలు ఖర్చులు అధికమవుతున్నాయి. మామిడి పంట కూడా తక్కువగా వస్తున్నది. మామిడి చెట్లు ఉన్న ప్రతి రైతుకు ప్రభుత్వాలు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి. నష్టపరిహారం కూడా అందించాలి.

- సిరిపురి రామచంద్ర, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, రాయచోటి.

ఈ ఏడాది పూత తక్కువ



వాతావరణం మార్పుల వలన ఈ ఏడాది పూత లేటుగా, తక్కువగా వచ్చింది. వర్షాలు కూడా తక్కువగానే పడ్డాయి. జిఖరీఫ్ మొదటలో జూన్ మాసంలో రైతులు మామిడి చెట్ల కత్తిరింపులు, దున్నకాలు చెట్లకు పాదులు వంటివి చేసుకోవాలి.

- పి.రవి చంద్రబాబు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, రాయచోటి.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

- కలెక్టర్ వి.విజయ్ రామరాజు


ప్రజాశక్తి - కడప అర్బన్



సమీక్షలో అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్

ఎన్నికల కోడ్ అమలుకు ముందు ఆమోదం పొంది పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధికా రులను ఆదేశించారు. సోమవారం కడప జిల్లా పరిషత్ సభా భవన్‌లో జెసిగణేష్ కుమార్, నగర కమిషనర్ జి.ఎస్.ఎస్. ప్రవీణ్ చంద్, పాడా ఒఎస్‌డి అనిల్ కుమార్‌రెడ్డి, డిఆర్‌ఒ గంగాధర్ గౌడ్‌తో కలిసి జిల్లాలో ఎన్నికల కోడ్ అమలుకు ముందే ఆమోదం పొంది పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల పురోగతి, రెవెన్యూ సర్వీసులు, లీగల్ అంశాలు, సచివాలయాల సేవలు, సిబ్బంది హాజరు ప్రభుత్వ భవన నిర్మాణాలు, అర్జీల పరిష్కారం వేగవంతం వంటి అంశాలపై సిహెచ్‌ఒలు, ఎంహెచ్‌ఒలతో సమీక్షించారు. మండల, నియోజకవర్గ స్థాయి అధికారులతో కలెక్టర్ నేరుగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు, పెండింగ్‌లోఉన్న అభివృద్ధి పనులపై అధికారులందరూ ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పూర్తి పని చేయాలన్నారు. ఆయా మండలాలు, మున్సిపాలిటీల పరిధిలో గృహనిర్మాణ పనులను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి గురువారం మండల స్థాయి అధికారులతో క్రమం తప్పకుండా ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రజారోగ్య భద్రత గురించి మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై ఎంపిడిఒలు, మున్సిపల్ అధికారులు, పంచా యతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎక్కడా కూడా తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మీ-సేవా, ఏపీ సేవా పోర్టల్ లో రోజూ విధిగా సర్వీసు రిక్వెస్టులను పరిశీలించి సంబంధిత రిపోర్టులు, పరిష్కార నివేది కలను నమోదు చేయాలన్నారు. పాఠశాలలు తెరిచేలోగా విద్యార్థులకు అసౌకర్యం లేకుండా తరగతి గదుల మరమ్మతులు, నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం నదీ తీరాల్లో ఎక్కడా కూడా ఇసుక సరఫరా చేయడానికి వీలు లేదన్నారు. జిల్లా వ్యాప్తంగా అధికారులకు కమ్యూనికేషన్ నెట్ వర్క్ మెరుగ్గా నిర్వహించడానికి మొత్తం 23 వేర్వేరు ఛానెళ్ల ద్వారా రెవెన్యూ సర్వీసులపై సమీక్షించుకునేందుకు కమ్యూ నికేషన్ సెట్స్ అందజేస్తామని తెలిపారు. కార్యక్ర మంలో అన్ని రెవెన్యూ డివిజన్ల ఆర్‌డిఒలతోపాటు నియోజకవర్గ, మండల ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడివోలు, హౌసింగ్, డ్వామా, డిఆర్‌డిఎ, పిఆర్ అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

పెన్నా నదికి జలకళ




పెన్నా నదిలో ప్రవహిస్తున్న నీరు

ప్రజాశక్తి-చెన్నూరు

ఎగువ ప్రాంతాల్లో కురిసన వర్షాలకు ఓ మోస్తరు వర్షాలకు కుందూ నదికి భారీగా వర్షపు నీరు చేరడంతో పెన్నానదికి వచ్చి చేరుతుండటంతో జలకళ సంతరించుకుంది. పెన్నా నది ఎగువ ప్రాంతంలో ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, కమలాపురం ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో పెన్నా నదిలోకి వర్షం నీరు పరుగులు పెడుతోంది. వల్లూరు మండలంలోని ఆదినిమ్మయపల్లి వద్ద పెన్నా నదిపై నిర్మించిన ఆనకట్ట వద్ద నీటికల సంచరించుకుంది. ఆనకట్ట నుంచి పెన్నా నదిలోకి నీరు చేరుతోంది. అక్కడ నుంచి చెన్నూరుకు నీరు నెమ్మదిగా కొనసాగుతున్నది. పెన్నా నదిలో ఇసుక అక్రమ తవ్వకాల కారణంగా పెద్దపెద్ద గుంతలు ఏర్పడి అక్కడ నీరు నిలిచిపోవడంతో నీటి ప్రవాహం తక్కువగా కొనసాగుతుంది. చెన్నూరు -కొండపేట పెన్నా నది వంతెన వద్దకు నీటి ప్రవాహం కొన సాగుతోంది. పెన్నా నదికి నేటి ప్రవాహం కొనసా గుతుండడంతో చెన్నూరు, కొండపేట, కుక్క రాయపల్లి, బలిసింగాయపల్లి, కనపర్తి, ఓబులంపల్లి, రామనపల్లి గ్రామాల పరిసర ప్రాంతాల్లో బోర్లతో పాటు వ్యవసాయం బోర్లలో నీటి సామర్థ్యం పెరుగేందుకు ఆస్కారం ఉందని పలువురు రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జనవరి నుంచి చుక్క నీరులేని పెన్నా నదిలో నీరు నాలుగు నెలలకు పెన్నా నదిలో నేటి ప్రవాహం కనిపించింది. పెన్నా నది పరిసర ప్రాంతాల గ్రామాల ప్రజలకు ఊరటనిచ్చింది.

23 నుంచి అన్నమయ్య వర్ధంతి ఉత్సవాలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



అన్నమాచార్యుల 108 అడుగుల విగ్రహం

పద కవితా పితామహుడు, తొలి వాగ్గేయకారుడు శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల 616వ వర్ధంతి ఉత్సవాలు తాళ్లపాక, బోయినపల్లిలోని 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. 23వ తేదీ ఉదయం 9 గంటలకు తిరుపతి అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులచే గోష్టి గానం, సప్తగిరుల సంకీర్తనం ఉంటుంది. 10.30 గంటలకు శ్రీనివాస కళ్యాణం, సాయంత్రం 6 గంటలకు ఉదయం భాస్కర్, హేమమాలిని బృందంచే సంగీత సభ, సాయంత్రం 6.30 గంటలకు అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద శ్రీవారికి ఊంజల సేవ, 7 గంటలకు వై.శ్రీనివాస్, ఎం.లక్ష్మీ కుమారి బృందంతో హరికథ కార్యక్రమాలు ఉంటాయి. 24వ తేదీ సాయంత్రం 6 గంటలకు తాళ్లపాకలో సుబ్రహ్మణ్యం, దేవిక, ఆర్.శ్యాం కుమార్, తులసి భాయి బృందం వారిచే సంగీత సభలు, రాత్రి 7 గంటలకు జి.అనసూయ, జి.వనజ కుమారిలచే హరికథ కాలక్షేపం ఉంటుంది. 25వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఎం.రవిచంద్ర, ఎ.మోనాలిని బృందంచే సంగీత సభ, రాత్రి 7 గంటలకు ఎం.మాధవి బృందం వారిచే తాళ్లపాకలో హరికథ, అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద శ్రీ కోదండరామ కళానాట్యమండలి బృందం బోయినపల్లె వారిచే ప్రత్యేక నాటక ప్రదర్శన కార్యక్రమాలు ఉంటాయి. రాజంపేట చుట్టుపక్కల ప్రాంత ప్రజలు పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని తాళ్లపాక ఆలయాల ఇన్‌స్పెక్టర్ బాలాజీ ఈ సందర్భంగా కోరారు.

తలసేమియా బాధితుల కోసం రక్తదానం

ప్రజాశక్తి- కడప అర్బన్



రక్తదానం చేస్తున్న దాత

అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల సంస్మరణ దినం సందర్భంగా చెన్నూరు మండలం చౌడేశ్వరి దేవాలయం వీధి యూత్, సభ్యులు సోమవారం ప్రభుత్వ ప్రజా వైద్యశాల రిమ్స్‌లో తలసేమియా బాధితుల కోసం రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. రక్త నిధి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేంద్ర మాట్లాడుతూ రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ శాఖ అధికారి డాక్టర్ ఎస్. రవిబాబు మాట్లాడుతూ 18 ఏళ్లు పైబడి 45 కిలోల బరువు ఉన్న ప్రతి ఒక్కరూ రక్త దానం చేయడానికి ముందుకు రావాలని కోరారు. ఇటువంటి సేవ కార్యక్రమాలు రాబయే రోజులలో గొప్పగా చేయాలని పేర్కొన్నారు. జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ భాస్కర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్త దానంచేసి నలుగురికి ప్రాణ దానం చేయవచ్చు అన్నారు. సగటు మనిషి సంవత్సరానికి 4 సార్లు రక్తదానం చేయవచ్చు తెలిపారు. రక్తదానానికి ముందుకు వచ్చిన చెన్నూర్ చౌడేశ్వరి దేవాలయం స్ట్రీట్ యూత్‌ని అభినందించారు. కార్యక్రమంలో పాండురంగ, లోకేష్, శ్రీకాంత్,గురప్ప, సునీల్, వీరేంద్ర, ధనుష్, సునీల్ రెడ్డి, పవన్ వారిని డిస్ట్రిక్ట్ ఆరోగ్య శాఖ తరుపున అభినందనలు తెలిపారు.



వేసవి శిబిరం ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఇఒ పాలెం నారాయణ

వేసవి వినోద శిబిరం అభినందనీయం : ఎంఇఒ

ప్రజాశక్తి - కడప అర్బన్

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కడప నగరంలోని రామకృష్ణనగర్ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో కడప మండల విద్యాధికారి పాలెం నారాయణ సోమవారం వేసవినోద కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాటాడుతూ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేసవి వినోద శిబిరం నిర్వహించడం హర్షనీయమన్నారు. ఆటలు,పాటలు, మ్యాజిక్, డాన్స్,పేపర్ కటింగ్, కథలు చెప్పడం వంటి అంశాలన్నీ పిల్లలకు విజ్ఞానంతో కూడినటువంటి వినోదాన్ని అందిస్తుందని తెలిపారు. విద్యార్థులందరూ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు ఏ.డి. దేవదత్తం మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరమూ వేసవిశిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఏడాదిలోనూ సెలవుల ప్రారంభంలో ఒక శిబిరాన్ని కో-పరేటివ్ కాలనీలో నిర్వహించామని చెప్పారు. రెండవది రామకృష్ణ నగర్‌లో ప్రారంభించామని తెలిపారు. రాబోయే సంవత్సరంలో కడపలో ఇంకా వివిధ ప్రాంతాలలో ఐదారు సమ్మర్ క్యాంపులు నిర్వహించే ప్రణాళిక చేస్తామని పేర్కొన్నారు. రామకృష్ణ నగర్ ప్రాంతంలో ని విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఇక్కడ ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమని తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో కళాకారులు 'పాడుదమా స్వేచ్ఛా గీతం' పాడి వినిపించారు. డ్రాయింగ్ మాస్టర్ శ్రీనివాసులు కొన్ని బొమ్మలు పిల్లలకు నేర్పించారు. మెజీషియన్ బాలబయన్న, సమీర్ బాషా మ్యాజిక్కులు చేసి చూపించారు. చాలా ఉత్సాహంగా, ఉల్లాసంగా పిల్లలు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి బాల బయన్న, పాఠశాల ఇన్‌ఛార్జి అబ్దుల్ గఫూర్, జిల్లా ట్రెజరర్ సమీర్ బాషా, జెవివి సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, డాక్టర్ మామిడి బాబు, సమతా కమిటీ సీనియర్ నాయకులు సునీత, నగర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివరాం, పైడికాలవ కిరణ్ కుమార్, జిల్లా సాంస్కృతి విభాగం కన్వీనర్ రంగనాయకులు, సమత కమిటీ సభ్యులు కామేశ్వరమ్మ, వై.అరుణ, గాయకులు డాక్టర్ చంద్రప్రకాష్ పాల్గొన్నారు.

24న కంప్యూటర్ బేస్డ్ టెస్ట్

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా కేంద్రంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ఈనెల 24న నిర్వహించనున్నట్లు డిఇఒ అనురాధ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష కెఒఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో, శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. హాల్ టికెట్‌లో ఫొటో ప్రింట్ కానీ అభ్యర్థులు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు తీసుకురావాలని తెలిపారు. నిర్ణీత సమయానికి అరగంట ముందు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని పేర్కొన్నారు.

వైవీయూ దూరవిద్య పీజీ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ పీజీ మొదటి సెమిస్టర్ ఫలితాలను సోమవారం విసి ప్రొఫెసర్ చింతా సుధాకర్ తన ఛాంబర్‌లో సిడిఇఒ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వై.పి.వెంకట సుబ్బయ్యతో కలసి విడుదల చేశారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్ఇపి)-2020 ఆధారంగా, చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ (సీబీసీఎస్)ని కలుపుకొని మొదటి సెమిస్టర్ పరీక్షలు ఏప్రిల్ 21 నుంచి 26 వ తేదీ వరకు నిర్వహించామన్నారు. ఈ పరీక్షల ఫలితాలను విశ్లేశిస్తే ఆర్థికశాస్త్రంలో 92.9 శాతం, ఇంగ్లీష్ లో 92.6 శాతం, చరిత్ర లో 100 శాతం, మాస్ కమ్యూనికేషన్, జర్నలిజంలో 87.5శాతం, రాజకీయ శాస్త్రంలో 94.5శాతం, మనస్తత్వశాస్త్రంలో 91.3 శాతం, ప్రత్యేక తెలుగు: 92.8 శాతం,వాణిజ్య శాస్త్రంలో 85.7శాతం మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. తొలిసారి ఉత్తమ ఫలితాలు సాధించిన అధ్యయన కేంద్రాల నిర్వహకులను, విద్యార్థులను అభినందించారు సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సీడీఓఈ)ని ద్వారా ఆర్ట్స్, హ్యూమానిటీస్, కామర్స్‌లో వైవీయూ పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులను అందిస్తోందన్నారు. పరీక్షలు ముగిసిన రెండు వారాల్లోనే ఫలితాలను ప్రచురించడంలో సీడీవోఇ బృందం వేగవంతమైన చర్యకు విసి ప్రశంసించారు. పరీక్షలు, అనతికాలంలోనే ఫలితాలు, మాడ్యూల్ అభివృద్ధి చేయడంలో ప్రశంసనీయమైన పాత్ర పోషించారంటూ సీడీవోఈ డైరెక్టర్ ప్రొఫెసర్ కె. కృష్ణా రెడ్డి ఆయన బృందాన్ని అభినందించారు. విద్యార్థులు ఏక కాలంలో రెండు కోర్సులను అభ్యసించవచ్చున్నారు. ఒకటి ఫిజికల్ మోడ్‌లో మరొకటి ఆన్‌లైన్ విధానంలో చదవవచ్చున్నారు. ఇలా పొందిన డిగ్రీలతో విద్య , ఉపాధి అవకాశాల కోసం సమాన విలువను కలిగి ఉంటాయని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్ అలానే ఆన్‌లైన్ లెర్నింగ్ విధానం విద్యార్థులకు ప్రయోజన కరమన్నారు. కార్యక్రమంలో సిడిఒఇ డిప్యూటీ డైరెక్టర్ ఎం. శ్రీధర్ బాబు, సిబ్బంది, టి. చంద్ర శేఖర్‌రెడ్డి, కె. రాజ శేఖర్, ఎస్జబీవుల్లా, జి. కనకరత్నమ్మ పాల్గొన్నారు.

విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వం వేసవి సెలవులు జూన్ 12 వరకు ఇచ్చిందని కానీ జిల్లాలో చైతన్య, నారాయణ విద్యా సంస్థల యాజమాన్యాలు ప్రయివేట్ ఉపాధ్యాయులకు వేసవి సెలవులు ముగియక ముందే వర్క్ షాప్ పేరుతో వారం రోజులుగా కడప నగర శివార్లలో క్లాసులు పెట్టడం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని వీటిపై విద్యా శాఖా అధికారులు చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ కోరారు. సోమవారం కడపలో ఆర్‌జెడి రాఘవ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, ప్రయివేట్ పాఠశాలకు వేసవి సెలవులు ఇచ్చినా కడప జిల్లాలో చైతన్య, నారాయణ కార్పొరేట్ విద్యాసంస్థల్లో మాత్రం ప్రయివేట్ ఉపాధ్యాయులకు వర్తించడం లేదని పేర్కొన్నారు. ప్రయివేట్ టీచర్లకు అడ్మిషన్ల పేరుతో ఒత్తిడి తెస్తున్నారని, మరోవైపు రకరకాల క్లాసులు,వర్క్ షాప్‌ల పేరుతో వేధించడం దారుణం అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చైతన్య, నారాయణ విద్యా సంస్థలు నడుచుకుంటున్నా విద్యా శాఖా అధికారులు పట్టించుకోకపోవడం సమంజసం కాదన్నారు. ఆర్‌జెడి ప్రయివేట్ ఉపాధ్యాయులను కాన్వాస్, ఇతర వర్క్ శాప్‌ల పేరుతో వేధిస్తే చర్యలు తీసుకుంటామని సర్క్యులర్ జారి చేసినా ఉన్నతాధికారుల ఆదేశాల బేఖాతర్ చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటున్నా కార్పొరేటు విద్యా సంస్థలు చైతన్య,నారాయణ పై విద్యా శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్‌జెడి స్పందిస్తూ సంబంధిత కార్పొరేట్ విద్యాసంస్థల పైన విచారించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు విజయ్ పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :**నారాయణ, చైతన్య కార్పొరేట్ విద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని ఇలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని ప్రయివేట్ టీచర్స్, లెక్చరర్స్ సంఘం రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు అన్నారు. ప్రాంతీయ సంయుక్త సంచాలకులు రాఘవరెడ్డికి ఈ మేరకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కడప కేంద్రంగా నిర్వహిస్తున్న నారాయణ, చైతన్య విద్యాసంస్థలను అధికారులు తక్షణమే మూసివేయించి ప్రయివేట్ ఉపాధ్యాయుల హక్కులను కాపాడాలని గడ్డంరాజు కోరారు.

ఎన్నికల హామీ గాలికి...

- ఐదేళ్లు గడిచినా వేయని రోడ్డు
- బురదతో స్థానికులకు ఇబ్బందులు
- టెండర్లకు మాత్రమే పరిమితం
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

2019 ఎన్నికల సమయంలో నూతన సిసి రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చిన నాయకులు గాలికి వదిలేశారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని హెచ్ టవర్ వీధిలో ఉన్న సిసి రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. రోడ్డు గుంతలమయంగా మారి ఎక్కడి వర్షపు నీరు అక్కడే నిలుస్తూ స్థానికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. స్థానికులు వర్షపు నీరు, బురదలోనే ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది. 2019 ఎన్నికల ముందు నూతన రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చి ఐదేళ్లు గడిచిన నెరవేర్చలేదని స్థానికులు మండిపడుతున్నారు. ఎన్నిసార్లు అధికారులు, నాయకుల చుట్టూ తిరిగినా ఎవరు పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. సమస్య ఉన్న ప్రాంతాల్లో రోడ్డు, డ్రెయినేజీలు వేయకుండా ప్రజా ప్రతినిధులు కాంట్రాక్టర్ల కోరిక మేరకు వారికి ఇష్టం వచ్చిన చోట రోడ్లు వేసి బిల్లులు చేసు కుంటున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. గెలిచిన వెంటనే రోడ్డు నిర్మాణం చేపడతామని చెప్పిన ప్రజా ప్రతినిధులు గడిచిన ఐదేళ్లలో ఎటువంటి నిర్మాణ పనులు చేయలేదు. ఈ ఏడాది జనవరి నెలలో తూతూ మంత్రంగా టెండర్లకు పిలిచి తరువాత పట్టించుకోలేదు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.22.30 లక్షలతో 250 మీటర్ల మేర సిసి రోడ్డు, రూ. 13.31 లక్షలతో 150 మీటర్ల మేర డ్రైనేజీ నిర్మాణానికి టెండర్లు పూర్తయింది. పనులను దక్కించుకున్న శివ కన్స్ట్రక్షన్ సంస్థ ఇప్పటివరకు పనులు మొదలు పెట్టలేదని స్థానికులు తెలిపారు. రానున్నది వర్షాకాలం కావడంతో పనులు వెంటనే ప్రారంభించి రోడ్లపై నీరు, బురద లేకుండా చర్యలు తీసుకొని, ఈ బాధల నుంచి విముక్తులను చేయాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.


టవర్ వీధిలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు


నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి

మాజీ ముఖ్యమంత్రులకు ఘన నివాళి

ప్రజాశక్తి - వేంపల్లె

మాజీ ముఖ్యమంత్రులైన ఆంధ్ర కేసరి ప్రకాశం పంతులు, బ్రహ్మానందరెడ్డిలకు కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆంధ్రకేసరి 67వ, బ్రహ్మానందరెడ్డి 30వ వర్ధంతిని పురస్కరించుకొని వారి చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. సందర్భంగా పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి మాట్లాడుతూ ప్రకాశం పంతులు స్వతంత్ర సమరయోధుడుగా, ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడుగా సమైక్య మద్రాసు ముఖ్యమంత్రిగా, ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఇటు రాష్ట్రానికి, దేశానికి, అటు కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవ చేసినట్లు చెప్పారు. సైమన్ కమిషన్ కు ఎదురొడ్డి నిలిచి ఆంధ్రకేసరిగా పేరు తెచ్చుకున్నారని చెప్పారు. విజయవాడ వద్ద కృష్ణా నదిపై నిర్మించిన ప్రకాశం బ్యారేజీ ఆయన మానస పుత్రిక అన్నారు. నిరాడంబరతకు పేరు గాంచిన వ్యక్తి ప్రకాశం పంతులు అన్నారు. కాసు బ్రహ్మానందరెడ్డి కూడా గొప్ప పరిపాలనాదక్షులన్నారు. రాష్ట్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా అటు దేశానికి, రాష్ట్రానికి సేవ చేసినట్లు చెప్పారు. సిసలైన సమైక్యవాది అన్నారు. బిసిలకు విద్య, ఉద్యోగాల్లో 25 శాతం రిజర్వేషన్లు కల్పించిన మహానీయుడు అన్నారు. కాసు బ్రహ్మానందరెడ్డి వల్ల బిసికి చెందిన విద్యార్థులు ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ, అమర్, బాలం సుబ్బరాయుడు, వినయ్, రాజా, ఉత్తన్న పాల్గొన్నారు.

గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

ప్రతి ఒక్కరూ గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ శాఖ అధికారి జె.సి.శివశంకర్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు గ్రంథలయ శాఖ అధికారి తెలిపారు. సోమవారం విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. రాష్ట్రాలు, రాజధానులు కొన్ని జనరల్ నాలెడ్జ్ అంశాలను గ్రంథాలయ శాఖ అధికారి వివరించారు. జూన్ 7 వరకు తరగతులు నిర్వహిస్తామని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ఆయన సూచించారు. కథలు, సైన్స్, విజ్ఞాన వినోద అంశాలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.


వీధిని శుభ్రం చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

జీతాల కోసం గ్రీన్ అంబాసిడర్ల ఎదురుచూపులు

ప్రజాశక్తి - బ్రహ్మంగారి మఠం

మండలంలోని గ్రీన్ అంబాసిడర్లు రెండేళ్లుగా జీతాల కోసం ఎదురు చూస్తున్నారు. రూ.6 వేల జీతంతో రోడ్లపై చెత్త, మురుగు కాలువలు శుభ్రం చేసి పరిసరాలు శుభ్రంగా ఉంచే తమకు వేతనాలు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కుటుంబ పోషణ కష్టంగా మారిందని తెలిపారు. వేతనాలొస్తాయనే ఆశతో ఇంట్లో పూట గడుపుట కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పులు ఇచ్చిన వారు తమ ఇళ్ల చుట్టు తిరుగుతున్నారని, వారికి ఏమి సమాధానం చెప్పాలో ఎప్పుడు జీతాలు వస్తాయో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధితాధికారులు స్పందించి తమకు వేతనాలు వచ్చేలా చూడాలని గ్రీన్ అంబాసిడర్లు కోరుతున్నారు.

110 మామిడి చెట్లు నరికివేత

- రూ.రెండు లక్షలు ఆస్తి నష్టం

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని మారెళ్ళ మడక గ్రామానికి చెందిన పార్థసారధిరెడ్డి, బొజ్జ యోగేశ్వర్ రెడ్డి, పొలంలో 110 మామిడి చెట్లు గుర్తుతెలియని వ్యక్తులు నరికేశారు. దీంతో బాధితులు సోమవారం ఆర్కె వ్యాలీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల వివరాల మేరకు.. పార్థసారధి రెడ్డి సొంత పొలంలో 30, బొజ్జ యోగేశ్వర్ రెడ్డి 80 మామిడి చెట్లు పెంచారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండు పొలాల్లోని సుమారు 110 చెట్లను నరికేశారు. అభివృద్ధిని చూడలేక పంట చేతికొచ్చే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు నరికి వేశారని బాధితులు వాపోయారు. దాదాపు రూ. 2 లక్షల మేర నష్టం వాటిలినట్లు పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్కే వ్యాలీ సిఐ గోవింద్ రెడ్డి తెలిపారు.


ఆదుకోవాలని వేడుకుంటున్న బాధిత రైతు

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి- వేంపల్లె

స్థానిక ఉర్దూ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్య కోసం పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ రవి ఒక ప్రకటనలో తెలిపారు. వేంపల్లెలోని ఉర్దూ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది నుంచి ఉర్దూతో పాటు ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు కూడా అడ్మిషన్లు పొందేందుకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. పదోతరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు సెకండ్ లాంగ్వేజ్ కింద ఉర్దూ, తెలుగు తీసుకోవచ్చు అన్నారు. పదవ తరగతి పాసైన ప్రతి విద్యార్థీ ఈ అవకాశన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇటీవల విడు దలైన ఇంటర్ పరీక్ష ఫలితాలలో 90 శాతం మేరకు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. మరిన్ని విషయాల కోసం కళాశాల ప్రిన్సిపల్ ను సంప్రదించాలని ఆయన కోరారు.

ఎన్నికల కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు : ఎస్‌పి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పి సిద్ధార్థ్‌కౌశల్ పేర్కొన్నారు. జూన్ నెల 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఆయన ప్రొద్దుటూరు నియోజకవర్గ కౌంటింగ్‌కు సంబంధించి చేపట్టాల్సిన బందోబస్త్ ఏర్పాట్లపై స్థానిక త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అధికారులతో సూక్ష్మ స్థాయిలో సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కౌంటింగ్ సందర్భంగా క్షేత్ర స్థాయిలో ఎక్కడెక్కడ, ఎవరు, ఎలా విధులు నిర్వహించాలో ఆదేశాలిచ్చారు. కౌంటింగ్ నేపథ్యంలో జూన్ నెల 1 నుంచి 6 వరకు ఎలాంటి ఊరేగింపులు, విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే రాజకీయ నేతల గృహనిర్బంధాలు, జిల్లా బహిష్కరణ అమలు చేస్తామని వివరించారు. ఎవరైనా శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే వారిపై కూడా నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో ప్రొద్దుటూరు డిఎస్‌పి మురళీధర్, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ జి.రాజు, ప్రొద్దుటూరు వన్ టౌన్ సిఐ శ్రీకాంత్, టూటౌన్ సిఐ అబ్దుల్ కరీం, త్రీ టౌన్ సిఐ వెంకటరమణ, రూరల్ సిఐ రమణారెడ్డి, ఎస్ఐలు పాల్గొన్నారు.


పోలీసులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్‌పి

చెత్తను తొలగించారు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మండల పరిధిలోని ధర్మాపురం గ్రామంలోని వాటర్ ప్లాంట్ వీధిలో చెత్త మొత్తం పేరుకుపోయి దారి మొత్తం కంపుకొట్టేది. ఈ సమస్యపై ప్రజాశక్తి పత్రికలో 'కంపు కొడుతున్నా పట్టించుకోరా..' అనే శీర్షిక పేరుతో సోమవారం ఒక ప్రత్యేక కథనం వచ్చింది. గ్రామంలోని ప్రజా ప్రతినిధి, గ్రామ పంచాయతీ సెక్రటరీ వెంటనే స్పందించి జెసిబితో చెత్త మొత్తం ఒక చోట చేర్చి ట్రాక్టర్‌తో గ్రామానికి దూరంగా పడేసి రహదారిని శుభ్రం చేశారు. అందుకు గ్రామస్తులు ప్రజాశక్తి పత్రికకు, సర్పంచ్‌కు, సెక్రెటరీకి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామానికి చెందిన తులసిరెడ్డి మాట్లాడుతూ ఈ రహదారికి శాశ్వత పరిష్కార మార్గం చూపాలని కోరారు. వాటర్ ప్లాంట్ వీధి కాలువకు తగ్గులో ఉండటం వల్ల చెత్త పేరుకుపోయిందని, వర్షం వస్తే ఈ దారిన నడవటం చాలా కష్టంగా ఉంటుందని తెలిపారు. అధికారులు స్పందించి కాలువ కంటే ఎత్తుగా సిమెంట్ రోడ్డు వేయించి, చెత్తను ఇలా పడేయకుండా ఒక చెత్త కుండిని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.


చెత్త తొలగించి శుభ్రం చేసిన తరువాత రహదారి

విజ్ఞానంతోనే ఉన్నత శిఖరాలు

ప్రొద్దుటూరు: విజ్ఞానం మనిషిని ఉన్నతశిఖరాలకు చేరుస్తుందని ఉపాధ్యాయులు నిర్మలజ్యోతి తెలిపారు. పౌరగ్రంథాలయ శాఖ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో సోమవారం వసంతపేట మున్సిపల్ ఉన్నతపాఠశాలలో వేసవి విజ్ఞానశిబిరంలో పిల్లలకు విజ్ఞానం పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిబిరాలు విద్యార్థుల మానసిక వికాసానికి సోపానాలుగా నిలుస్తాయన్నారు. రాయలసీమ జూనియర్‌కళాశాల గ్రంథాలయాధికారి గంగాధర్‌రెడ్డి జిరాఫీ చెస్ కథను, పాటను విద్యార్థులచే చెప్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయం రికార్డు అసిస్టెంట్ ఇబ్రహీం సాహెబ్ ,పాఠశాల సిబ్బంది రెహ్మాన్‌ఖాన్, సారమ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా బసవ జయంతి

పులివెందుల రూరల్ : పట్టణంలోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలో సోమవారం బసవ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వీరశైవ గురు జంగమ్మ లింగాయతి సంఘం ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు భీమలింగస్వామి బసవేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఎడ్లబండిపై బసవేశ్వరుని చిత్రపటాన్ని ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు కలశాలు పట్టుకుని గ్రామోత్సవంలో పాల్గొన్నారు. గ్రామోత్సవం వెంబడి కోలాటం ప్రత్యేకంగా ఆకట్టుకుంది.


రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సిఐ దస్తగిరి

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - ముద్దనూరు

అల్లర్లు సృష్టించి గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ దస్తగిరి హెచ్చరించారు. స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం సిఐ ఆధ్వర్యంలో ఎస్ఐ మైనుద్దీన్ రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల రోజున చోటు చేసుకున్న గొడవలు దృష్టిలో పెట్టుకుని ముందస్తు జాగ్రత్తగా కౌనెలింగ్ ఇచ్చామని చెప్పారు. సోషల్ మీడియాలో వాట్సాప్,ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్ గ్రూపుల్లో రెచ్చగొట్టే పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరి ంచారు. ఎన్నికల కౌంటింగ్ రోజున ర్యాలీలు, బాణాసంచా పేల్చేందుకు అనుమతి లేదన్నారు. అల్లర్లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుం టామన్నారు. ప్రజల శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.


వాహనాన్ని తనిఖీ చేస్తున్న సిఐ, ఎస్ఐలు

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో సోమవారం సిఐ దస్తగిరి ఆధ్వర్యంలో ఎస్ఐ మైనుద్దీన్ ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ ఎన్నికల రోజున చోటు చేసుకున్న గొడవలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తగా ఎస్పి ఆదేశాల మేరకు వాహనాల తనిఖీలు చేపట్టామన్నారు. అవాంఛనీయ సంఘటనలు నివారించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టామన్నారు. వాహనాల్లో ఆయుధాలు రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : పట్టణంలోని కడప రోడ్డు సమీపంలో రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద సోమవారం అర్బన్ ఎస్ఐ అరుణ్ రెడ్డి వాహనాలు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్పి ఆదేశాల మేరకు వాహనాలు తనిఖీ చేస్తున్నామని అన్నారు. ప్రతి వాహనదారుడు వాహనానికి సంబంధించిన రికార్డులు కచ్చితంగా పెట్టుకోవాలన్నారు. వాహనాలకు సంబంధించి పత్రాలను ఆయన పరిశీలించారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - కడప అర్బన్

అభిరామ్ మిత్ర బృందం కలిసి ఐదేళ్లుగా ఆర్తి పాఠశాల విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్, బూట్లు, పుస్తకాలు పంపిణీ చేసు న్నారు. సోమవారం ఆర్తి హోమ్‌లో వీటిని అంద జేశారు. ఈ సందర్భంగా ఆర్తీ పాఠశాల డైరెక్టర్ భాగ్యమ్మ మాట్లాడుతూ విద్యలో రాణిస్తూ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తున్నామని తెలిపారు. విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలలో నిలవాలని ఆకాంక్షించారు. దాతలను అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న దాతలు

27 నుంచి ఉచిత శిక్షణ

కడప : కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ, వీడి యోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేరింగ్, సర్వీసింగ్ లలో గ్రామీణ ప్రాం తాలకు చెందిన యువకులకు ఈనెల 27 నుండి 30 రోజుల పాటు ఉచిత శిక్షణ నిర్వహి స్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువకులు సద్విని యోగం చేసుకోవాలని కోరా రు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పించను న్నట్లు తెలిపారు. 94409 05478లో సంప్రదిం చాలన్నారు.

ఐటిఐ విద్యతో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి - వేంపల్లె

పారిశ్రామిక రంగానికి ఐటిఐ విద్యార్థుల అవశ్యకత ఎంతో ఉందని వేంపల్లె కందుల ఓబుల్‌రెడ్డి ఐటిఐ ప్రిన్సిపల్ ప్రసాద్ రావు అన్నారు. సోమవారం వేంపల్లెలోని ఐటిఐలో ఆయన విలేకరులతో మాట్లా డుతూ విద్యార్థి పదో తరగతి పూర్తి చేసిన వెంటనే ఐటిఐ విద్యను అభ్యసిస్తే ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నట్లు చెప్పారు. మిగిలిన కోర్సుల కంటే ఐటిఐ అభ్యర్థులకే ఉపాధి అవకాశాలు ఉన్నట్లు చెప్పారు. పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందే కొద్ది అవకాశాలు మరింత మెరుగు పడుతున్నట్లు చెప్పారు. ఐటిఐ చదివిన విద్యార్థులకు ప్రారంభంలోనే రూ. 16 వేల జీతంతో పరిశ్రమలు తీసుకొంటున్నట్లు చెప్పారు. సాంకేతిక రంగానికి ఉన్నంత డిమాండ్ మరో రంగానికి ఉండదని తెలిపారు. మిగిలిన కోర్సులలో డిగ్రీ పూర్తి చేస్తేనే ఉపాధి అవకాశాలు అంతంత మాత్రంగానే ఉన్నట్లు చెప్పారు. ఐటిఐ అభ్యర్థులు పని చేయడానికి సిద్ధపడితే తిరుపతి, బెంగళూరు, చెన్నై, శ్రీసిటితో పాటు అయా జిల్లాలోని పరిశ్రమల్లో పని చేయడానికి అభ్యర్థులను తీసుకొంటున్నట్లు చెప్పారు. ఈ మధ్య కాలంలో ఎక్కువ కంపెనీలు ఐటిఐ విద్యార్థులు కావాలంటూ తమను సంప్రదిస్తున్నట్లు చెప్పారు. ఇతర రంగానికి డిమాండ్ లేనట్లు చెప్పారు. పదోతరగతి పాసు, లేక ఫైయిల్ అయిన విద్యార్థులకు ఐటిఐలో అడ్మిషన్లు ఉంటాయని చెప్పారు. చాలా మంది విద్యార్థులు ఇంటర్ చదివి పాసు, లేదా ఫైయిల్ అయిన తర్వాత చేరుతున్నట్లు చెప్పారు. దానికి బదులుగా పదోతరగతి పూర్తి అయిన వెంటనే ఐటిఐలో చేరి సర్టిఫికెట్లు పొందితే రెండు సంవత్సరాల కాలం వృథా కాదు అన్నారు. ఐటిఐలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం అయ్యిందని చెప్పారు. ఉత్సహవంతులైన విద్యార్థులకు విదేశాల్లోనూ ఎక్కువ జీతంతో ఉపాధి అవకాశాలు ఉన్నట్లు చెప్పారు. తక్కువ ఖర్చుతో చిన్న వయస్సులో ఉద్యోగ అర్హత కలిగే చదువులు ఐటిఐ విద్య అన్నారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఐటిఐ ప్రాధాన్యతను గుర్తించాలని కోరారు. అడ్మిషన్ల వివరాలకు వేంపల్లె ఐటిఐలో సంప్రదించాలని కోరారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ప్రసాద్‌రావు

ఉన్నతమైన విద్యే లక్ష్యం

- దీప్తి హైస్కూల్ కరస్పాండెంట్ లెక్కల రమణారెడ్డి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

పేద విద్యార్థులకు తక్కువ ఫీజుతో ఉన్నతమైన విద్యను అందించడమే లక్ష్యమని దీప్తి హైస్కూల్ కరస్పాండెంట్ లెక్కల రమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల పదోతరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని చెప్పారు. తమ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు డాక్టర్స్, ఇంజినీర్స్ ఇలా అనేక రంగాలలో పనిచేస్తూ ఉండడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం అడ్మిషన్లు జరగుతున్నాయని ప్రభుత్వ ఆదేశాల మేరకు క్లాసులు ప్రారంభిస్తామని తెలిపారు. హెడ్ మాస్టర్ రామంజనేయులు ఎల్లప్పుడూ విద్యార్థులను పర్యవేక్షిస్తుంటారని, అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో విద్యా బోధన ఉంటుంది అన్నారు. తెలుగు,ఇంగ్లీష్ మీడియం ఉన్నాయని చెప్పారు.

విత్తనాల కోసం నివేదికలు పంపాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఖరీఫ్ సీజన్ సంబంధించి విత్తనాలు, ఎరువులు ఇతరత్రా వాటికి సంబంధించి పూర్తిస్థాయి నివేదికలను తయారు చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శివమోహన్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని తహశీల్దార్ కార్యాలయంలో రైతు భరోసా కేంద్ర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కావాల్సిన అన్ని రకాల విత్తనాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రైతులకు కావాల్సిన విత్తనాల సాగుపై క్షేత్రస్థాయిలో ఆర్‌బికె సిబ్బంది వారితో చర్చించి పూర్తిస్థాయి నివేదికలను అందజేయాలన్నారు. ప్రభుత్వం ఇస్తున్న అన్ని రకాల విత్తనాలను రాయితీతో అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పచ్చి రొట్టె ఎరువులు సాగు చేయడం వల్ల భూమి సారవంతంగా మారుతు ందన్నారు. రైతులు వేసవి దుక్కులు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి - చాపాడు

మండల కేంద్రమైన చాపాడు రైతు సేవా సహకార సంఘం బ్యాంక్ ఆవరణలో ఉన్న ట్రాన్స్‌పార్మర్ కొద్ది రోజులుగా పొగలు చిమ్ముతూ ప్రమాదకరంగా మారింది. చుట్టు పక్కల వారు భయాందోళనకు గురవుతూ సమస్య పరిష్కరించాలని ట్రాన్స్‌కో సిబ్బందికి విన్నవించినా వారు ఏమాత్రమూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. మైదుకూరు - ప్రొద్దుటూరు ప్రధాన రహదారికి సమీపంలో వ్యాపార సముదాయాల దుకాణాలకు వెనుక వైపున ఈ ట్రాన్స్ ఫార్మర్ ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిత్యం మంటలు చెలరేగుతూ పొగలు వస్తున్నాయి. దీంతో ఏదైనా ప్రమాదం సంభవిస్తే ప్రమాదం జరుగుతుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ప్రమాదపు అంచున ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


రక్షణ కవచం లేని ట్రాన్స్‌ఫార్మర్

మహారాజశ్రీ గౌరవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, కడప

O.S.No. 34/2023

బంద్రేవు వెంకట నారాయణరెడ్డి ...వాది

Vs

1. యర్రపురెడ్డి శ్రీనివాసరెడ్డి తండ్రి వెంకటరామిరెడ్డి, వయస్సు 58 సం॥రాలు, ఉద్యోగం, డోర్‌నెం.45/402-1, బాలాజీనగర్, కడప సిటి, వై.ఎస్.ఆర్. కడప జిల్లా.

...మొదటి ప్రతివాది

పై కేసును అనగా ఓ.ఎస్.నెం.505/2023ని వాది రాజశ్రీ గౌరవ సీనియర్ సివిల్ జడ్జి, కడప నందు ప్రతివాదులపై వ్యాజ్యములోని షెడ్యూల్ ఆస్తిని తన పేరుపైన రిజిస్ట్రేషన్ చేయించమని కేసును దాఖలు చేసియున్నారు. అయితే మొదటి ప్రతివాది అయిన మీరు కోర్టు సమన్లు తీసుకోనందున, విషయము పేపరు ప్రకటన ద్వారా మీకు తెలుపుమని రాజశ్రీ కోర్టు వారు ఆదేశించుతూ 27.06.2024కు వాయిదా వేసి మీకు పై కేసు నందు ఏవైనా ఆక్షేపణలు ఉన్నచో 27.06.2024వ తేదీన 10.30 ని.లకు కోర్టు నందు ఖుద్దున గాని, వకీలు ద్వారా గాని వచ్చి తెలుపుకోవలెనని లేనిచో పరోక్షమున తీర్మానించునని తెలియజేయడమైనది.

//రాజశ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు//

పి.వి.రమణారెడ్డి

వాది తరపు వకీలు, కడప.

మహారాజశ్రీ గౌరవ మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, కడప

O.S.No. 505/2023

పంగా బైరేసు ...వాది

Vs

2.నంద్యాల సుబ్బరాయుడు, తండ్రి లేట్ సుబ్బన్న, వయస్సు 50 సం॥లు, వ్యవసాయం, గోపరాజుపల్లి గ్రామం, పెండ్లిమర్రి మండలం, వై.ఎస్.ఆర్.కడప జిల్లా.

...2వ ప్రతివాది

పై కేసును అనగా ఓ.ఎస్.నెం.505/2023ని వాది అయిన పంగా బైరేసు రాజశ్రీ గౌరవ మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, కడప నందు ప్రతివాదులపై వ్యాజ్యములోని షెడ్యూల్ ఆస్తి పై తన హక్కు డిక్లరేషన్, రెవిన్యూ రికార్డులలో మొదటి ప్రతివాది పేరుపై ఉన్న నమోదులను తొలగించమని మరియు ప్రతివాదులు తనను ప్రతిఘటించకుండా నిషేదాజ్ఞలుని తనకు మంజూరు చేయమని కేసును దాఖలు చేసియున్నారు. అయితే రెండవ ప్రతివాది అయిన మీరు కోర్టు సమన్లు తీసుకోనందున, విషయము పేపరు ప్రకటన ద్వారా మీకు తెలుపుమని రాజశ్రీ మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారు ఆదేశించుతూ 20.06.2024కు వాయిదా వేసి మీకు పై కేసు నందు ఏవైనా ఆక్షేపణలు ఉన్నచో 20.06.2024వ తేదీన 10.30 ని.లకు కోర్టు నందు ఖుద్దున గాని, వకీలు ద్వారా గాని వచ్చి తెలుపుకోవలెనని లేనిచో పరోక్షమున తీర్మానించునని తెలియజేయడమైనది.

//రాజశ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు//

పి.వి.రమణారెడ్డి

వాది తరపు వకీలు, కడప.

మహారాజశ్రీ గౌరవ మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, కడప

I.A. No. 390/2023 in
O.S.No. 505/2023

పంగా బైరేసు ...పిటిషనర్/వాది

Vs

2.నంద్యాల సుబ్బరాయుడు, తండ్రి లేట్ సుబ్బన్న, వయస్సు 50 సం॥లు, వ్యవసాయం, గోపరాజుపల్లి గ్రామం, పెండ్లిమర్రి మండలం, వై.ఎస్.ఆర్.కడప జిల్లా.

...2వ రెస్పాండెంట్/2వ ప్రతివాది

పై కేసును అనగా ఐ.ఏ.నెం.390/2023 ఇన్ ఓ.ఎస్.నెం.505/2023ని పిటిషనర్/వాది అయిన పంగా బైరేసు రాజశ్రీ గౌరవ మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, కడప నందు రెస్పాండెంట్లు/ప్రతివాదులపై వ్యాజ్యములోని షెడ్యూల్ ఆస్తి కేసు పెండింగు ఉండగా అనుభవించు కొనునపుడు ప్రతిఘటించకుండా తాత్కాలిక నిషేదాజ్ఞలను కోరుతూ పిటిషను దాఖలు చేసియున్నారు. అయితే రెండవ ప్రతివాది అయిన మీరు కోర్టు నోటీసు తీసుకోనందున, విషయము పేపరు ప్రకటన ద్వారా మీకు తెలుపుమని రాజశ్రీ మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారు ఆదేశించుతూ 20.06.2024కు వాయిదా వేసి రెండవ రెస్పాండెంట్/ ప్రతివాది అయిన మీరు ఏవైనా ఆక్షేపణలు ఉన్నచో 20.06.2024వ తేదీన 10.30 ని.లకు కోర్టు నందు ఖుద్దున గాని, వకీలు ద్వారా గాని వచ్చి తెలుపుకోవలెనని లేనిచో పై పిటిషన్‌ను పరోక్షమున తీర్మానించునని ఉత్తర్వులు తెలియజేయడమైనది.

//రాజశ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు//

పి.వి.రమణారెడ్డి

వాది తరపు వకీలు, కడప.

మహారాజశ్రీ గౌరవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, కడప

I.A. No. 117/2023 in
O.S.No. 34/2023

బంద్రేవు వెంకట నారాయణరెడ్డి ...పిటిషనర్/వాది

Vs

1. యర్రపురెడ్డి శ్రీనివాసరెడ్డి తండ్రి వెంకటరామిరెడ్డి, వయస్సు 58 సం॥రాలు, ఉద్యోగం, డోర్‌నెం.45/402-1, బాలాజీనగర్, కడప సిటి, వై.ఎస్.ఆర్. కడప జిల్లా.

...మొదటి రెస్పాండెంట్/మొదటి ప్రతివాది

పై కేసును అనగా ఐ.ఏ.నెం.117/2023 ఇన్ ఓ.ఎస్.నెం.34/2023ని పిటిషనర్/వాది రాజశ్రీ గౌరవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, కడప నందు రెస్పాండెంట్లు/ప్రతివాదులపై వ్యాజ్యములోని షెడ్యూల్ ఆస్తిని ఇతరుల పేరుపై అమ్మకుండా తాత్కాలిక నిషేదాజ్ఞలను కోరుతూ పిటిషను దాఖలు చేసియున్నారు. అయితే మొదటి ప్రతివాది అయిన మీరు నోటీసు తీసుకోనందున, విషయము పేపరు ప్రకటన ద్వారా మీకు తెలుపుమని రాజశ్రీ కోర్టు వారు ఆదేశించుతూ 27.06.2024కు వాయిదా వేసి మొదటి రెస్పాండెంట్/ ప్రతివాది యర్రపురెడ్డి శ్రీనివాసరెడ్డి అయిన మీరు ఏవైనా ఆక్షేపణలు ఉన్నచో 27.06.2024వ తేదీన 10.30 ని.లకు కోర్టు నందు ఖుద్దున గాని, వకీలు ద్వారా గాని వచ్చి తెలుపుకోవలెనని లేనిచో పై పిటిషన్‌ను పరోక్షమున తీర్మానించి ఉత్తర్వులు జారీ చేయునని తెలియజేయడమైనది.

//రాజశ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు//

పి.వి.రమణారెడ్డి

వాది తరపు వకీలు, కడప.